క్లుప్తంగా

గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



దామెర : ప్రజాయుద్ధ నౌకగా పేరు గడించిన గద్దర్ ఆశయ సాధనకు సమాజంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి కోరారు. గద్దర్ మృతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల కేంద్రంలో ఆదివారం పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడారు. గద్దర్ పాటలతో ప్రజాఉద్యమ గొంతుకగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదని కీర్తించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పోతుల కొమ్మాలు, దామెర రమేష్, సోనబోయిన కొమురయ్య, దామెర రవి, వర్కూటి సత్యనారాయణ, దుర్శెట్టి భిక్షపతి, లింగయ్య, రజినీకర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

ఐనవోలు : ప్రజాగాయకుడు గద్దర్ మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గద్దర్ మృతి పేదలను, కార్మికులను, బడుగులను కలచివేసిందని తెలిపారు. పాటల ద్వారా ప్రజాచైతన్యానికి ఊపిరిలూదారని గద్దర్‌ను కొనియాడారు. గద్దర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ఎల్కతుర్తి : గద్దర్ మృతి పట్ల ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పేదలను ఆదుకోవడమే సీఎంఆర్ఎఫ్ ధ్యేయం



శాయంపేట : పేదలను ఆదుకోవడమే సీఎంఆర్ఎఫ్ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేసిన రూ.3 లక్షల చెక్కును అతడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం అందజేసి మాట్లాడారు. పేదలు అనారోగ్యం పాలై అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే వారు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు తెలిపారు. పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు.

గీత కార్మికుడికి గాయాలు

ఐనవోలు : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నందనం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన బుర్ర కిషన్ కులవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో కిషన్ చెయ్యి విరగడంతోపాటు కాళ్లకు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు ఆయన్ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన తనుగుల సరోజన ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పర్వతగిరి రాజు ఆదివారం పరామర్శించారు. తొలుత సరోజన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వెల్దె ప్రసాద్, యూత్ విభాగం మండల ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వస్తువుల పంపిణీ



విద్యారణ్యపురి: వరదలకు నష్టపోయిన కుటుంబాలకు హనుమకొండలోని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా జవహర్‌నగర్ కాలనీ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అనంత్, కోశాధికారి రమేష్, డాక్టర్ సాంబమూర్తి, సలహాదారులు వేణుగోపాల్, ఇతర బాధ్యులు పాల్గొన్నారు.



దామెర : జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, తదితరులు



ఆత్మకూరు : అక్కంపేటలో నివాళులర్పిస్తున్న ఏసీపీ కిశోర్, తదితరులు

ఆచార్య జయశంకర్‌కు ఘననివాళి

● ఘనంగా జయంతి వేడుక

పరకాల : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్‌కు ఊరూరా ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య జయశంకర్ చిత్రపటానికి చైర్‌పర్సన్ అనిత, మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, పాలకవర్గ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చైర్‌పర్సన్ అనిత మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి ఆచార్య జయశంకర్ జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అమరధామంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, పరకాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని ఆత్మకూరు, అక్కంపేట గ్రామాల్లో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అక్కంపేటలో జయశంకర్ విగ్రహానికి ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎస్సై ప్రసాద్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ ఎన్కతాల్ల రవీందర్, సర్పంచ్ విజయ హంశాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరులోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆచార్య జయశంకర్ విగ్రహానికి తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు బాబుమియా, నాయకులు పోలెపాక ఆరోగ్యం, అంకతి రవి తదితరులు నివాళులర్పించారు.

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో, ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి సర్పంచ్ కందగట్ల రవి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కోల కిషన్, ఉదారి మహేష్, పెంబర్తి వినయ్, బత్తుల కార్తీక్, పులిచేరు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



పరకాలలో..



నడికూడలో..



ఎల్కతుర్తి : కోతులనడుమలో..

దామెర : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి ఎంపీపీ కాగితాల శంకర్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జయశంకర్ సేవలను కొనియాడారు. మండలంలోని ముస్త్యాలపల్లిలోని కూడలిలో ఆచార్య జయశంకర్ విగ్రహానికి ఎంపీడీఓ రవీందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఊరుగొండ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, నాయకులు ఎన్కతాళ్ల రవీందర్, జన్ను మల్లయ్య, నేరెళ్ల కమలాకర్, వేల్పుల ప్రసాద్, చిలువేరు రాజ్‌కుమార్, దాడి రమేష్, గడ్డం సదానందం, మేరుగు కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మచ్చ అనసూర్య ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపీపీ కుమారస్వామి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి సర్పంచ్ బోయినపల్లి రజిత దేవేందర్‌రావుతోపాటు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రయ్య, నాయకులు ఎర్రోళ్ల చైతన్య, ఎర్రోళ్ల జగన్, రాజేష్, సునీల్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పల్లెల అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : కాంగ్రెస్‌తోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి స్పష్టం చేశారు. భీమదేవపల్లి మండలంలోని ధర్మారం, గోవర్ధనగిరి తండా గ్రామాల్లో 'పల్లెపల్లెకు ప్రవీణన్న, గడపగడపకు కాంగ్రెస్' నినాదంతో ఆదివారం నిర్వహించిన పర్యటన కార్యక్రమంలో తొలుత ఆయన ఆయా గ్రామాల్లోని కూడళ్లలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం రానున్న ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న హామీలకు సంబంధించిన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గతంలోనూ కాంగ్రెస్ హయంలోనే మారుమూల గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ పాలనలో పల్లెల్లోని రోడ్లన్నీ బురదమయమయ్యాయని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతామని ఊదరగొట్టి గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ పల్లెలను విస్మరించడంతో గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయని ఆందోళన వెలిబుచ్చారు. ఏ గ్రామంలోనూ సరైన రోడ్లు లేవని, డ్రైనేజీ కాల్వలు అధ్వానంగా మారాయని తెలిపారు. తాగడానికి సరిపడా నీరు సైతం అందడం లేదన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమవడం బీఆర్ఎస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెలను అభివృద్ధి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమారస్వామి, అయిలయ్య, కనుకయ్య, లక్ష్మారెడ్డి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఐనవోలు : ఐక్యపోరాటాలతోనే ప్రజల, కార్మికుల సమస్యలు పరిష్కారమౌతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చుక్కయ్య తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ మండల స్థాయి శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా బండి పర్వతాలు వ్యవహరించగా ముఖ్యఅతిథిగా చుక్కయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల, కార్మికుల సమస్యలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. దళితులకు భూపంపిణీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, యువతకు ఉద్యోగాలు, తదితర అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి తదనంతరం వాటిని అమలు చేయకుండా స్వార్థ పాలన సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. పాలకులు ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాలని సూచించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఉప్పలయ్య మతోన్మాదంపై బోధించారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తు లౌకిక విధానాలకు విఘాతం కలిగిస్తోందని చెప్పారు. పాలకులపై తప్పుడు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాలు నిర్మించి పార్టీ బలోపేతానికి పాటుపడాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్మిక వర్గ రాజ్యస్థాపన కోసం అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, నాయకులు నారాయణరెడ్డి, గుండెకారి మహేందర్, దర్శనాల సంపత్, ఉప్పలయ్య, శంకర్‌రెడ్డి, కవిత, నర్సయ్య, యాకయ్య, సలీం రాజు, శరణ్య, రాధిక, నరేష్, పోచమ్మ, సృజన, బాబురావు, చిన్న మహేందర్, కుమారస్వామి, మాదాసి అపర్ణ, సుష్మ, పుష్ప, సోనీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్కయ్య

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కమలాపూర్ : మండలంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం, సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం నిర్వహించారు. తొలుత స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒకరికొకరు బ్యాండ్లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఉమా మహేశ్వర గార్డెన్స్‌లో నిర్వహించిన సమ్మేళనం, సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు చిన్ననాట విద్యాబుద్ధులు నేర్పిన హెచ్‌ఎం ప్రేమ్‌చందర్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఇనుగాల విజయ్‌కుమార్, పబ్బు రమేష్ గౌడ్, మొగిలిచెర్ల ప్రశాంత్, పులికంటి రమేష్, కిషన్, మాటం మహేందర్, కిన్నెర రమేష్, నూక నాగరాజు, రేవంత్‌కుమార్, సంతోష్ చక్రవర్తి, నిశ్చల, కల్పన, జ్యోతి, రాధిక, అశోకరాణి, కరుణ, గీత తదితరులు పాల్గొన్నారు.



నాటి హెచ్ఎంతో పూర్వవిద్యార్థులు

రాష్ట్రంలో యువజన వ్యతిరేక పాలన

● విద్యార్థి గర్జన సభ కరపత్రాల ఆవిష్కరణ

పరకాల : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ యువజన వ్యతిరేక పాలన సాగిస్తోందని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటేరు చక్రి విమర్శించారు. ఈనెల 8న హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించనున్న విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని అమరధామంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పసుల విజయ్ ఆధ్వర్యంలో విద్యార్థి గర్జన సభ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రి మాట్లాడారు. సుమారు 1300 మంది యువకులు ప్రాణత్యాగం చేసి తెలంగాణను సాధించగా సీఎం కేసీఆర్ గద్దెనెక్కి యువజన వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని నమ్మించి యువజనుల ప్రాణాలను తీశారని ఆరోపించారు. ఉద్యోగ నియామకాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన రీతిలో గుణపాఠం చెప్పేలా, గద్దె దించేలా యువత అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బొచ్చు రాకేష్, సూదమల్ల వినయ్, జాలిగపు అనిల్, అమ్మ రాజు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చక్రి, తదితరులు

నిషాంత్ స్మారక క్రీడాపోటీలు ప్రారంభం



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఈటల నిషాంత్ స్మారక అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశల్లో పోటీలు నిర్వహించారు. కబడ్డీ బాలుర విభాగంలో ఎంజేపీ బాలురు, టీఎస్ఎంఎస్, బాలికల విభాగంలో ఎంజేపీ బాలికలు, జెడ్పీహెచ్ఎస్ మర్రిపల్లిగూడెం, ఖోఖో బాలుర విభాగంలో ఎంజేపీ బాలుర, జెడ్పీహెచ్ఎస్ మర్రిపల్లిగూడెం, బాలికల విభాగంలో కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ మర్రిపల్లిగూడెం, వాలీబాల్ బాలుర విభాగంలో ఎంజేపీ బాలురు, జెడ్పీహెచ్ఎస్ మర్రిపల్లిగూడెం, బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కమలాపూర్, జెడ్పీహెచ్ఎస్ గూడూరు పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు మండల విద్యాధికారి ఇ.రాంకిషన్‌రాజు తెలిపారు. కార్యక్రమాల్లో పీడీలు, పీఈటీలు రాజు, దస్రు, నాగరాజు, సుమన్, సంగీత, తరంగిణి, హెచ్‌ఎంలు పవన్, ప్రిన్సిపాల్ మల్లయ్య, సీఆర్పీలు సుభాష్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మల్లయ్య

ఈనెల 7 నుంచి జరగనున్న అండర్–16 విభాగం రాష్ట్రస్థాయి జావెలిన్ త్రో పోటీలకు మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎ.రాంచరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఓ.మల్లయ్య తెలిపారు. రాంచరణ్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీలు నాగరాజు, వెంకటేష్ తదితరులు అభినందించారు.

రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు కీలకం

● సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు కీలకంగా నిలిచారని బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకుడు బలిజె నర్సింహరాములు తెలిపారు. అసెంబ్లీలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రస్తావించడాన్ని స్వాగతిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం నర్సింహరాములు మాట్లాడారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉద్యమకారుల పక్షాన నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమకారులకు రూ.25 వేల పింఛన్ ఇవ్వాలని, ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, దళితబంధు తరహాలో పథకం అమలు చేసి ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాడిశెట్టి గణేష్, ఇమ్మడిశెట్టి రవీందర్, పల్లెబోయిన సారయ్య, నాలికె సందీప్, బుర్ర విజయ్, తుడుం వెంకటేష్, ఎమ్డీ రాజమహ్మద్, నాలికె రాము, పి.రాజు, కోడెపాక బాబు, కొడిమాల సంతోష్, బండి రంజిత్, బేర్గు తరుణ్‌గోపి, కూనపులి రమేష్, నమితాబాజి అశోక్, కరుణాకర్ పాల్గొన్నారు.



శాయంపేట : చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నర్సింహరాములు, తదితరులు



ఆత్మకూరు : ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నర్సింహరాములు, తదితరులు

ఆత్మకూరు : తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలతో ముద్రించిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బాబుమియా, నాయకులు పోలెపాక ఆరోగ్యం, అంకతి రవి, లింగమూర్తి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కారం కావాలి

● ఎమ్మెల్యే చల్లాకు కృతజ్ఞతలు

పరకాల : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతోనైనా హోంగార్డుల సమస్యలు పరిష్కారం కావాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డులుగా పని చేస్తున్న కుమార్, సుధాకర్, నోమేష్, భాస్కర్, సంతోష్, ఉపేందర్ ఆకాంక్షించారు. ఆదివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో హోంగార్డుల సమస్యలను ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రస్తావించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ధర్మారెడ్డికి ఆదివారం హోంగార్డులు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. హోంగార్డులు అనేక సమస్యలతో సతమతమౌతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డుల సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కరించాలని కోరారు.

వైభవంగా బోనాలు

సంగెం : మండలంలోని మొండ్రాయి, ఇతర గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. గ్రామ దేవత పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. పాడిపంటలు వృద్ధి చెంది గ్రామస్తులంతా పిల్లపాపలతో చల్లంగా చూడాలని వేడుకున్నారు.

పాలకుల వైఫల్యంతోనే మణిపూర్‌లో హింస



శాంతి ర్యాలీలో క్రైస్తవులు, ముస్లింలు

● పట్టణంలో శాంతి ర్యాలీ

పరకాల : కేంద్రంలోని బీజేపీతోపాటు మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ఆ రాష్ట్రంలో హింస కొనసాగుతోందని క్రైస్తవులు, ముస్లింలు విమర్శించారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసకు నిరసనగా నడికూడ, పరకాల పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవ సంఘం, ముస్లిం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ, ముస్లిం మతాల పెద్దలు మాట్లాడారు. మణిపూర్‌లో దారుణాలను ఖండించారు. కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హింసకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కౌన్సిలర్లు శనిగరపు రజని, మడికొండ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

ఎల్కతుర్తి : మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని స్థానిక ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కోరారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడుతూ పట్టుబడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామ పరిధిలోని రహదారిపై పలు వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రోడ్డు భద్రత నిబంధనలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన ఇతర పత్రాలన్నిటినీ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించొద్దని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.